

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## బొమ్మరాసిపేట్ అబ్బన్న కుంటలో తల్లి,కూతుళ్లు ఆత్మహత్యా యత్నం..

**-స్థానికులు తల్లిని ప్రాణాలతో కాపాడగా..కూతురు గల్లంతు..? అన్వేషనకు చర్యలు**

**శామీర్‌పేట, డిసెంబరు 11, ప్రభాతవార్త :** బొమ్మరాసిపేట్ గ్రామానికి చెందిన తల్లికూతరు ఇరువురు ఆ గ్రామ పరిధిలో అబ్బన్నకుంటలో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం బొమ్మరాసిపేట్‌కు చెందిన కళమ్మ (55), కూతురు కవిత (30) ఇద్దరు కలిసి అబ్బన్నకుంట నీటిలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ విషయాన్ని స్థానికులు సమాచారం అందుకుని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని చూసి ఆ గ్రామస్థులు తల్లి కళమ్మను నీటిలో నుంచి కాపాడినట్లు ఆమె చికిత్స కోసం ఆర్‌విఎం హాస్పిటల్‌కు తరలించటం జరిగిందని పోలీసులు తెలిపారు. అయితే కూతురు కవిత మాత్రం కనిపించకుండ పోయిందని నీటిలో గల్లంతు అయినట్లు గుర్తించి నీటిలో అన్వేషించటం జరిగింది. పోలీసులు, రక్షణ సిబ్బంది సహాయంతో కవిత కోసం వెతకటానికి ప్రయత్నం రాత్రి వరకు చేయటం జరిగింది. తల్లి కళమ్మ మాత్రం హాస్పిటల్‌లో ఉందని, కూతురు నీటిలో గల్లంతు అయినట్లు గమనించి ఆ చూకి కోసం ప్రయత్నం చేయటం జరిగింది. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చరిత్రలోనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు

# మంత్రివర్గంలో మొండిచేయి

**-జిల్లా కాంగ్రెస్ క్యాడర్‌లో నిరుత్సాహం**

**-ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ మంత్రి వర్గంలో మొదటి స్థానం**

**-తెలంగాణ మంత్రి వర్గంలోనూ మొదటి స్థానం**

**-ప్రాధాన్యతకు సంతరించుకున్న రంగారెడ్డి జిల్లాకు ఈ సారి మొండిచేయి**

**-అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల్లోనూ విమర్శలు వ్యక్తం**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, డిసెంబర్ 11(ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 10 సంవత్సరాల తర్వాత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనంతరం రెండవ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన ఎనుముల రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్న మంత్రి వర్గంలో రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో అదికార కాంగ్రెస్ పార్టీతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత 40 సంవత్సరాల రాజకీయ చరిత్రలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు పోటాపోటీగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న తరుణంలో కొన్ని పర్యాయాలు కాంగ్రెస్, మరికొన్ని పర్యాయాలు తెలుగుదేశం ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అదికారాన్ని కొనసాగించిన సమయంలో నాడు ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేసిన నీలం సంజీవ్‌రావు, జలగం వెంగల్‌రావు, మర్రి చెన్నారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఎంటి రామారావు, చంద్రబాబునాయుడు, మర్రి జనార్ధన్‌రెడ్డి, కొణిశెట్టి రోశయ్య, నల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు కూడా కొత్తగా ఏర్పడిన మంత్రి వర్గంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రి వర్గంలో మొదటి వరుసలో మంత్రులను ఎంపిక చేసిన ఘనత రంగారెడ్డి జిల్లాకే దక్కింది. అలాంటిది నేడు రంగారెడ్డి జిల్లాకు ఎనుముల రేవంత్‌రెడ్డి మొదటి మంత్రి వర్గం విస్తరణలో ప్రాతినిధ్యం కల్పించకపోవడం చూస్తుంటే జిల్లాలో సీనియర్ నాయకులు ఉనికిని కోల్పోతున్నారా అనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. ఈ సారి మంత్రి వర్గ విస్తరణలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకే మొదటి ప్రాదాన్యత ఇవ్వడం చూస్తుంటే అక్కడ అత్యధిక స్థానాలు కాంగ్రెస్ గెలిచినందుకే తగిన ప్రాదాన్యతనిచ్చి తక్కువ స్థానాలు కాంగ్రెస్ గెలిచిన రంగారెడ్డి జిల్లాకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదనే ప్రచారం కూడా కొనసాగుతుంది. గత 35 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాకు బలమైన నాయకులుగా పట్లోళ్ల ఇంద్రారెడ్డి, దేవేందర్‌గౌడ్, సబితాఇంద్రారెడ్డి సుదీర్ఘ కాలం తెలుగుదేశం, కాంగ్రెస్ హయాంలో మొదటి వరుసలోనే మంత్రి వర్గంలో కీలక రోల్ పోషించేవారు. అలాంటిది ఈ సారి కాంగ్రెస్‌లో కొంతమంది సీనియర్ నాయకులు ఉన్నప్పటికి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇచ్చుకోకపోవడం పట్ల కొంత కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, మేదావులు, పలువురు పలు రకాలుగా చర్చలు చర్చించుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సగం స్థానాలకు కైవసం చేసుకున్నప్పటికి ఒకరిద్దరిని కూడా ముందు వరుసలో ఎంపిక చేయకపోవడం కొంత కాంగ్రెస్ క్యాడర్‌లో నిరుత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కాంగ్రెస్ నాయకుల్లో ఐక్యత లోపం వల్లే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లాకు కొంత చిన్నచూపు చూస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు చూస్తుంటే అధిష్ఠానం కూడా ఈ విషయంలో తగిన సూచనలు చేయడం లేదని అభిప్రాయం కూడా వస్తుంది. రేవంత్‌రెడ్డి రెండవ మంత్రి వర్గ విస్తరణలో జిల్లాకు తగిన న్యాయం చేస్తరా... అనేది వేచి చూడాల్సిందే.

## ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్**

**-కలెక్టరేట్‌లో ప్రజావాణి.. అందిన 53 ఫిర్యాదులు**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 11, ప్రభాతవార్త**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, పలువురు అధికారులు ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు, ధరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగ ప్రజల నుంచి 53ధరఖాస్తులు, వినతులు, ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగ మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించుకోవటానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారని వారు ఇచ్చిన వాటికి సంబంధిత అధికారులు సత్వరంగ పరిష్కారాలు చూపాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఆ ధరఖాస్తులను సకాలంలో పరిష్కరిస్తే వారికి మేలు జరుగుతుందన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం జరిగేది లేనిది స్పష్టంగ తెలియజేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండ ఎప్పటికపుడు పరిశీలన చేయాలని, పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఆర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి ఆర్జీదారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లా సంబంధిత అధికారులు ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వభూమిలో అక్రమ కట్టడాల కూల్చివేతలు



కొండాపూర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చీవేయిస్తున్న తహశీల్దార్ కృష్ణ

**ఘట్‌కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**

ప్రభుత్వభూమిలో అక్రమంగా నిర్మాణాలు చేస్తే సహించబోమని ఘట్‌కేసర్ తహశీల్దార్ జి.కృష్ణ హెచ్చరించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్ సర్వేనంబర్ 257లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చీవేశారు. ప్రభుత్వభూమిలో పట్టాలు ఉన్నాయంటూ కొందరు అక్రమంగా ఇళ్లు నిర్మి స్తున్నారు. దీంతో తహశీల్దార్‌కు ఫిర్యాదు రావడంతో ఆయన జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకొని జేసీబీతో కట్టడాలను ధ్ వంసం చేయించారు. సోమవారం ఉదయం ఆయన సిబ్బందితో వెళ్లి నిర్మాణంలో ఉన్న గదులను కూల్చీవేయించారు. ప్రభుత్వభూమిలో ఏలాంటి నిర్మాణాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ కృష్ణ స్పష్టం చేశారు.

## టీస్టాల్‌లో అగ్నిప్రమాదం..రూ.5 లక్షల ఆస్తి నష్టం

**-దుండగులు నిప్పంటించారని అనుమానం**



ఘట్‌కేసర్ బైపాస్ రహదారి పక్కన దగ్ధమైన టీస్టాల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ రామునాయక్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**

విద్యుత్‌షాట్ సర్క్యూట్‌తో టీస్టాల్‌లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చందుపట్లగూడకు చెందిన గడిల శేఖర్‌రెడ్డి ఘట్‌కేసర్ బైపాస్ రహదారి సర్వీస్‌రోడ్డు పక్కన టీటైమ్ టీస్టాల్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి 10:30 గంటలకు టీస్టాల్ మూసి వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం '5:30 గంటలకు వచ్చి చూడగా టీస్టాల్ కంటైనర్ నుంచి పొగలు రావడంతో స్థానిక పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అర్పే ప్రయత్నం చేశారు. కాగా టీస్టాల్‌లో అప్పటికే ఫ్రీజ్, క్యాష్‌కౌంటర్, ఫర్నిచర్, ఫైబర్ కుర్చీలు, టేబుల్స్, టీటైమ్‌స్టాక్, సీసీ కెమెరాల మానిటర్, సిపియూ, సీసీ కెమెరా, గ్యాస్ స్టవ్, సిలిండర్లు, కూల్‌డ్రింక్స్, కంటైనర్ పూర్తిగా కాలిపోయింది. ఎస్ఐ రామునాయక్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. టీస్టాల్ యాజమాని శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేందర్‌రెడ్డి తెలిపారు. దాదాపు రూ.5 లక్షల విలువైన సామాగ్రీ అగ్నికి దగ్ధం అయ్యిందని బాధితుడు శేఖర్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా ఇతర కారణాలతో సంభవించి ఉండవచ్చనే కోణంలో కేసు దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాగా టీస్టాల్ కాలిపోవడంపై దుండగులు కావాలని నిప్పంటించి ఉంటారని యాజమాని శేఖర్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు.

## వరుస దొంగతనాలతో ప్రజల భయాందోళన

**ఘట్‌కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసిఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మేడపాటినగర్‌లో ఇటీవలి కాలంలో వరుసగా దొంగతనాలు జరుగున్నాయి. చోరీల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెబుతున్నా దొంగతనాలు మాత్రం ఆగడం లేదు. తాజాగా మేడపాటినగర్‌లో ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి దొంగతనం జరిగింది. మెరుగు సురేశ్, సుజాత దంపతులు ఈనెల 6న రాత్రి 8 గంటలకు ఇంటికి తాళం వేసి బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వివాహ వేడుకలకు వెళ్లారు. సోమవారం ఉదయం 8:30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా ప్రధాన తలుపు తాళం విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా వేసి ఉండగా రెండు తులాల బంగారు నల్లపూసల దండ, రూ.30 వేల నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరినట్లుగా నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు ఎస్ఐ రామునాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని చోరీ వివరాలను సేకరించారు. బాధితురాలు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దరా ్యప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ మహేం దర్‌రెడ్డి తెలిపారు. మేడపాటినగర్ కాలనీలో ఇటీవల కాలంలో దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పలుసార్లు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామంటూ హామీలు గుప్పించి వెళ్లారని ఇప్పటి వరకు కెమెరాలు అందుబాటులోకి తీసుకురాలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా కాలనీవాసులు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ మహేం దర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.



ఘట్‌కేసర్ మేడపాటినగర్‌లో చోరీ వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

# ప్రభుత్వ సబ్సిడీతో ఆర్థిక సాధికారిత సాధించాలి

**-గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయం**

**-సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత**

**-విద్యా, వైద్యంలో మంచి ఫలితాలు రావాలి**

**-స్థాయి సంఘాల సమావేశాల్లో జడ్పి చైర్‌పర్సన్ సునీతారెడ్డి**

**వికారాబాద్,డిసెంబర్ 11, ప్రభాతవార్త:**

మహిళలు ఆర్థిక స్వాహలంభన కోసం కుటీర పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు రావాలని, జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే సబ్సిడీని తీసుకొని చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పాలని జడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన స్థాయిసంఘాల సమావేశాల్లో వివిధ శాఖలపై ఆమె జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, సీఎం సొంత జిల్లా అయినందున అందరి చూపు మన జిల్లాపై ఉంటుందని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి పనిచేయాలన్నారు. అబివృద్ధి, సంక్షేమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని ఎక్కడి సమస్యలు అక్కడ పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. త్వరలో జడ్పిటీసీ, ఎంపీపీలు అందరం కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి జిల్లాకు నిధులు కేటాయిం చాలని కోరుదామని సభ్యులు అందరూ తీర్మానించారు. జిల్లా సాధారణ సమావేశానికి సైతం ఆహ్వానించాలని సభ్యులందరు సునీతారెడ్డి ని కోరారు. సీఎం జిల్లా అయినందున ఎమ్మెల్యేలను కలుపుకొని త్వరలోనే సీఎంను కలుద్దామని నిర్ణయించారు. అప్పటిలోగా జిల్లాలో శాఖల వారిగా అవసరం అగు నిధులపై ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సునీతారెడ్డి సూచించారు. అనంతరం ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జాతీయ ఉపాధి హామీ పథకం, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షిం చారు. ముఖ్యంగా పదవ తరగతిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలని విద్యాధికారికి సూచిం చారు. వైద్యం విషయంలోనూ మంచి సేవలు అందించి మన్ననలు పొందాలనున్నారు. జిల్లాలో ఇరిగేషన్ ద్వారా తాండూరులో కాగ్నాపై ఐదు చెక్ డ్యాంల నిర్మాణం కోసం రూ.40 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించాలని సూచించారు. జిల్లాలో పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లోని రుద్రారం, వికారాబాద్, కుల్కచర్ల, పరిగి, దోమ మండలాల్లో మంజూరైన విద్యుత్తు సబ్ స్టేషన్లకు వెంటనే రెవెన్యూ అధికారులు భూములు కేటాయించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు మహిళాశిశు, సాంఘీక సంక్షేమ శాఖలపై ఆ సంఘాల అధ్య క్షతన సమీక్ష చేశారు. అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అభివద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేయాల న్నారు. రానున్న స్థాయి సంఘాల సమావేశానికి వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జడ్పీ చైర్‌పర్సన్ అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ స్థాయీ సంఘం ఛైర్మన్ విజయ్ కుమార్, సాంఘీక సంక్షేమ స్థాయి సంఘం చైర్ పర్సన్ అరుణదేశ్, మహిళా శిశు సంక్షేమ స్థాయి సంఘం చైర పర్సన్ సుజాత, జడ్పి సీఈఓ జానకీ రెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, జడ్పిటీసీ సభ్యులు మహిపాల్, ధారాసింగ్, హరిప్రియ, నాగరాణీ, సంతోష, శ్రీనివాస్ రెడ్డి, మంజుల, మేఘమాల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



స్థాయి సంఘం సమావేశాల్లో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి

# మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘన స్వాగతం



శామీర్‌పేట మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనంగ స్వాగతం పలికి సన్మానించిన కాంగ్రెస్ నాయకుల దృశ్యం



తూంకుంటలో కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనంగ స్వాగతం పలికిన దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 11, ప్రభాతవార్త**

శామీర్‌పేట ఉమ్మడి మండలంలో రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగ స్వాగతం పలికారు. సోమవారం ఉదయం శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని దేవరయాంజాల్, తూంకుంట, శామీర్‌పేట, తుర్కపల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నగరం నుంచి హుస్నాబాద్ నియోజకవర్గానికి రాజీవ్ రహదారిన వెళుతూ మంత్రి దేవరయాంజాల్‌ను సందర్శించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, రాజీవ్‌గాంధీ, డాక్టర్ వైస్ రాజశేఖర్‌రెడ్డిల విగ్రహాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారం ఇచ్చారని ఓట్లు వేసి గెలిపించిన వారికి మంత్రి దన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రకటించి అధికారం చేపట్టగానే రెండు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, మిగతా వాటిని కూడ త్వరలో ప్రజలకు అందజేయటం జరుగుతుందన్నారు. దేవరయాంజాల్ గ్రామాన్ని సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి నివాసంలో మంత్రికి తేనేటి విందును ఇచ్చారు. దీనిలో మంత్రితో పాటు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. దేవరయాంజాల్‌లో జరిగిన మంత్రి కార్యక్రమంలో మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి పి.బాలేశ్, టిపిసిసి కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు పత్తికుమార్, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షులు సురేశ్‌నాయక్, తూంకుంట మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఆర్.పూజాభరత్‌సింగ్, మాజీ సర్పంచు లావణ్య శంకర్‌గౌడ్, మాజీ వైస్‌ఎంపిపి వి.లక్ష్మినారాయణ, మండల బిసి సెల్ అధ్యక్షులు పి.లక్ష్మినారాయణ, మాజీ ఉపసర్పంచు టి.శంకర్‌గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఆ తరువాత తూంకుంటలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పలువురు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఆర్.పూజభరత్‌సింగ్‌లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు మండల బిసి సెల్ ఉపాధ్యక్షులు టిఆర్ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు రాంచందర్‌యాదవ్, టి.లింగంగౌడ్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, జి.మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మురళీగౌడ్, గిరి, ప్రదీప్, గౌస్, రాజు, మాజీ వైస్‌ఎంపిపి వి.లక్ష్మినారాయణ, పలువురు కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని స్థానికులు మంత్రిని కోరగ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు కావు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆ తరువాత శామీర్‌పేటలోని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి, మాజీ సిఎం డాక్టర్ వైస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు ఎండి ముజీబ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు జి.బాల్‌రాజ్‌గౌడ్, ఎం.మహేందర్‌యాదవ్, మండల నాయకులు వై.నాగేశ్వర్‌గౌడ్, వి.అశోక్, ఎంపిటిసిలు డి.సాయిబాబు, ఎస్.ఇందిర, గ్రామ మాజీ సర్పంచు బి.కిషోర్‌యాదవ్, మండల నాయకులు కె.కృష్ణారెడ్డి, ఎంసిపల్లి మండల అధ్యక్షులు బి.నర్సింలుయాదవ్, నాయకులు లతారెడ్డి, రాజు, రాంరెడ్డి, బిక్షపతి, నవీన్‌రెడ్డి, అంజనేయులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆ తరువాత తుర్కపల్లి గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టిపిసిసి కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి జి.వేణుగోపాల్‌రెడ్డి, మండల నాయకులు యు.వెంకటేశ, రాజు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగ స్వాగతం పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను దేవరయాంజాల్, తూంకుంట, శామీర్‌పేట, తుర్కపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగ సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఆ తరువాత రాజీవ్‌రహదారిన మంత్రి పొన్నం ప్రభాకర్ గజ్వేల్ నియోజకవర్గంకు బయలు దేరి వెళ్లారు.

## రోడ్డు ప్రమాదంలో గొడవ యువకుడిపై దాడి..

**-యువకుడి మృతి**

**వికారాబాద్,డిసెంబర్ 11, ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదం జరుగడంతో ఇరువురి యువకులు గొడవపడ్డారు. దీంతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ టంగుటూరు శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోమిన్‌పేట్ మండలం మల్‌రెడ్డి గూడ గ్రామానికి చెందిన అభిషేక్ రెడ్డి(22) బెంగుళూరు లో బీటెక్ చదువుతున్నాడు. ఈ మద్యనే స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం రాత్రి 8.40 గంటలకు వికారాబాద్ పట్టణానికి టీఎస్ 34 ఎఫ్1597 నెంబరు గల ద్విచక్ర వాహనంపై వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. కొత్తగడి సమీపంలో, మోమిన్‌పేట్ మండలం రామ్నాథ్‌గుడుపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి అభిషేక్‌రెడ్డి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో అభిషేక్, ప్రవీణ్ కు స్వల్ప గాయాలయ్యాయి. కోపోద్రిక్తుడైన ప్రవీణ్ అభిషేక్‌రెడ్డిపై దాడీ చేశాడు. అంతటితో ఆగకుండా వికారాబాద్‌లో ఉంటున్న తన తమ్ముడు చాకలి నరేశ్, అతని స్నేహితులను పిలిపించి అభిషేక్‌రెడ్డిని రాళ్ళతో దాడీ చేస్తూ పిడి గుద్దులు గుద్దారు. దీంతో అభిషేక్‌రెడ్డి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని, వికారాబాద్ లోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం అభిషేక్‌రెడ్డిని తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఆసుపత్రికి తరలించగా, మార్గమద్యలో అభిషేక్‌రెడ్డి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టంగుటూరు శ్రీను తెలిపారు.

## ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు
### -ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్



వ్యాపారులకు పలు సూచనలు చేస్తున్న ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్

**కడ్తాల్,డిసెంబరు 11 ప్రభాతవార్త :** కడ్తాల్ పట్టణంలో ఎన్‌హెచ్ 765 హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారికిరువైపులా ఫుట్ పాత్‌లను ఆక్రమించి చిరు వ్యాపారాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కడ్తాల్ ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్ హెచ్చరించారు. సోమవారం కడ్తాల్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులతో కలిసి రోడ్డుపై ఉన్న తోపుడు బండ్లు, పండ్లు, దుకాణ యజమానులు రోడ్డుపై పెట్టిన వస్తువులను తొలగించారు. అనంతరం షాపుల యజమానులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, కడ్తాల్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ఎన్ఆర్‌జిఈఐలో కృత్రిమ మేధస్సుపై జాతీయ సదస్సు



ఎన్ఎన్ఆర్‌జిఐలో జరిగిన జాతీయ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కిషోర్‌కుమార్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** విద్యార్థులకు కృత్రిమ మేధస్సు ఎంతగానో దోహదపడుతుందని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ టి.కిషోర్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని నల్ల నర్సింహ్మారెడ్డి కళాశాలలో సోమవారం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఫర్ బిల్డింగ్ సిగ్నల్ ప్రాసెసింగ్ అప్లికేషన్స్' పై కృత్రిమ మేధస్సు జాతీయ ఫాకల్టీ డవలప్‌మెంట్ (ఎఫ్‌డిపి) కార్యక్రమం నిర్వహించారు. ఎఐసిటి ఈ-అటల్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఈనెల 16వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరక్టర్ డాక్టర్ సివి.క్రిష్ణారెడ్డి తెలిపారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ కిషోర్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆచార్యులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ఉన్న అవకాశాలు, ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగ అధిపతి-కార్యక్రమ కన్వీనర్ డాక్టర్.ఎస్. రవిచంద్, వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ షరీఫ్ జ్ఞాపకార్థంగా పోలీసులు అన్నదానం



జగ్గంగూడలోని అనాథ ఆశ్రమంలో పేదలకు అన్నదానం చేసిన శామీర్‌పేట పోలీసుల దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 11, ప్రభాతవార్త** శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ షరీఫ్ గత ఏడాదిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందటంతో ఆయన కోసం జ్ఞాపకార్థంగ శామీర్‌పేట పోలీసులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జగ్గంగూడలోని హోమ్ ఫర్ డిజబుల్డ్ ఆశ్రమంలో గల సుమారు 240మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట సిఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కీసర సర్పంచుపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 11, ప్రభాతవార్త** కీసర సర్పంచు మాదురివెంకటేశకు షోకాజ్ నోటీసులు జారీ చేసినా అధికారులు అందజేసినా 45రోజులు దాటినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు కీసర గ్రామ బిజెపి అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమ వారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఆయన కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కీసర గ్రామ సర్పంచు గతంలో గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదు చేస్తే విచా రణ జరిపారని, షోకాజ్ నోటీసు జారీ చేశారని, ఆ నిధులను రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి కోరారు. సర్పంచుపై చట్టరీత్య తగు చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. ఆ సర్పంచును సస్పెండ్ చేసి నిధులను రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను బిజెపి గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గతంలోనూ పలు సార్లు ఫిర్యాదుల చేయటం జరిగిందని అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతుందని వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన బిఆర్ఎస్ నేతలు

**కొండాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** సంగారెడ్డి శాసన సభ్యులుగా ఎన్నికైన చింత ప్రభాకర్‌ను సోమవారం మండలంలోని తొగర్‌పల్లి గ్రామ బిఆర్ఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. చింత ప్రభాకర్ నివాసానికి బిఆర్ఎస్ నేతలు చేరుకుని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సోచయ్య, ప్రేమానందం, వార్డు సభ్యులు బాలరాజ్, కిరన్, వర కుమార్, రాములు, అశోక్, విజయరావు, గంగయ్య, పవన్, మాజీ వార్డు సభ్యులు ఆనంద్, చింటూ ఉన్నారు.

## మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

**జోగిపేట, డిసెంబరు 11, ప్రభాతవార్త:** మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం అల్లాదుర్గం తహసీల్దార్ సతీష్‌కు విద్యార్థులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జిల్లాను సిరిసిల్ల జోన్‌లో కలపడం మూలంగా జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ప్రజలు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. మెదక్ జిల్లా హైద్రాబాద్‌కు సమీపంలో ఉందని, జోనల్ వ్యవస్థ ఏర్పాటులో జిల్లాను చార్మినార్‌జోన్‌లో కలిపితే జిల్లా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. విద్యారంగంలో జిల్లా చాలావెనుకబడి ఉందని వారు విచారం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలో పయనించాలంటే జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని వారు సూచించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నగరేశ్వర దేవాలయంలో ఘనంగా మహా రుద్రాభిషేకం

**రామాయంపేట, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** శ్రీనగరేశ్వర దేవాలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పబ్బా సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త నాగరాజు, డిబిఆర్ శంకరయ్య, చిగుళ్లపల్లి వెంకటేశం, కందుకూరి శ్రీనివాస్, చొల్లేటి రాజు భక్తులు పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, డిసెంబరు 11, ప్రభాతవార్త:** పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఎంపిపి అధ్యక్షులు మోతిబాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలో వసతి గృహాలు, పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. మండల సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరయిన అధికారులకు నోటీసులు జారీచేయాలని ఎంపిడి రాజశేఖర్ కవ్‌లాస్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యేగా తొలి మారు సమావేశంలోపాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఆయా శాఖల అధికారులు ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**ఆలయంలో ఎమ్మెల్యే పూజలు...**

నాగల్‌గిద్దలోని దత్తాత్రి దేవాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డిని అర్చకులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాజశేఖర్ కవ్‌లాస్, జడ్పిటిసి రాజురాథోడ్, ఎంపిపి ఉపాధ్యక్షులు పండరియాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు విఠల్‌రావు పాటిల్, సంజీవరెడ్డి, సునీత ప్రభాకర్‌రెడ్డి, అనిల్ పాటిల్, సంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంత్రి పొన్న ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన వైస్ ఎంపీపీ

**వెల్దుర్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేష్‌రెడ్డి, కుకునూరు మాజీ సర్పంచి మల్లేశం ఉన్నారు.

## ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కలిసిన బొమ్మారం సర్పంచి



ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

**వెల్దుర్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామ సర్పంచి శంకర్‌తో పాటు గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు వివరించినట్లు సర్పంచి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించిన మాజీ ఎమ్మెల్యే

**మనూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని దవ్వూర్ తండాకు చెందిన సరోజా బాయి అనారోగ్యంతో అవస్థలు పడుతుండటంతో మెరుగైన చికిత్స అందుకునేందుకు సోమవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి 60వేల రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు సలీం, కంగ్టి మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు సంతోష్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి

**చిన్నశంకరంపేట,నవంబర్ 11,ప్రభాతవార్త:** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పోచయ్యను సోమవారం చిన్న శంకరంపేటలో ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం అయిన సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే విడుదల చేయాలని, మెడికల్ బిల్లులు రాక ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ఉపాధ్యాయుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ, జబ్బర్, రతన్, శ్రీనివాస్, జహిరోద్దిన్, మహేష్, మాదవి, భవాని, శివ, కుమార్ తదితరులున్నారు.



పోచయ్యను సన్మానిస్తున్న జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు



ఎమ్మెల్యే సంజీవరెడ్డికి గొంగడితో సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

## ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఘనంగా సన్మానం

**నారాయణఖేడ్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** నూతనంగా ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టరు పట్లోళ్ల సంజీవరెడ్డికి ఘనంగా సన్మానించారు. సోమవారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే గృహంలో రాష్ట్ర గొర్రెల మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి ఆధ్వర్యంలో గొల్లకుర్మ సంఘ నాయకులు బోకె గొల్ల కుర్మల వృత్తి గొంగడి,శాలువ పూలమలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంతం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1952 కాలం నుంచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందని ఆయన గుర్తు చేశారు. నారాయణఖేడ్ ప్రాంతంలో కార్మికులకు నూతనంగా పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పిస్తే బాగుటుందన్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సంజీవరెడ్డికి మంత్రి పదవి ఇస్తే నారాయణఖేడ్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గానికి ఎన్నికైన ఎమ్మెల్యే సంజీవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వలని నారాయణఖేడ్ ప్రాంత కాంగ్రెస్ నాయకులు కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కిషన్‌రావు, గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గోవింద్‌యాదవ్, గోవింద్‌నాయక్, సందడి సామేల్, వివిధ మండల గొల్లకుర్మ సంఘం అధ్యక్షులు దత్తుగోండ, బాబన్న, విఠల్, బాగయ్య, పందరి, భూంగోండ, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, నవంబర్ 11, ప్రభాతవార్త:** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో 20 కోట్ల రుపాయలను అంచాన వ్యయంతో నిర్మిస్తున్న 160 దుకాణాల సముదాయం నిర్మాణ పనులను పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయితే.. ఇటు వ్యాపారస్తులకు అటు రైతులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. త్వరితగతిన పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ అశోక్, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆటోవాలాలను ఆదుకోవాలి

**చిన్నశంకరంపేట, నవంబర్ 11,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేయడంతో ఆటోలో ఎవరూ ఎక్కడం లేదని, ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ మార్గంచూపాలని గవ్వలపల్లి ఆటో యూనియన్ సభ్యులు కోరారు. సోమవారం అగ్రహారంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఆటోనే నమ్ముకొని జివిస్తున్నామని, మహిళలు ఎక్కకపోవడంతో నష్టపోతున్నామని, ఆటోకు ఫైనాన్స్‌లో ఎలా కట్టాలో అర్థం కావడం లేదని, వారు వాపోయారు. ప్రభుత్వం తనకు దారి చూపించాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శ్రీనివాస్, నర్సింలు, కుమార్,సత్యనారాయణ, శివ తదితరులున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఆటో యూనియన్ సభ్యులు

# విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

**మనూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** విద్య, వైద్యరంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని నారాయఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఎంపిపి అధ్యక్షులు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ ఉంటారని సూచించారు. విద్య రంగం బాగుంటేనే సమాజం బాగుంటుందని గుర్తు చేశారు. అధికారులు ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దుదిగొండ సర్పంచ్ రాజు మాట్లాడుతూ గ్రామంలో తీర్మానం చేయకుండానే పనులు ఎలా నిర్వహిస్తారని పంచాయితీ రాజ్ ఏఈ బాల్‌లింగను నిలదీశారు. పిటిసి పెంటయ్య మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేగా మొదటి మారు మండల సభలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఎంపిపి అధ్యక్షురాలు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఎంపిపి ఉపాధ్యక్షులు రాములు, ఎంపిడిఓ షాజులుద్దీన్, తహసీల్దార్ మల్లేష్ కుఏమార్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈలు బాల్‌లింగం, అన్నన్, ఏపిఓ వంశీకృష్ణ, ఏపిఓ షాహిద్, ఎంపిటిసి సభ్యులు తులజమ్మ, రుక్మిణి బాయి, పెంటయ్య, సర్పంచ్‌లు రాజు, కవిత, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**ఘనంగా ఎమ్మెల్యేకు సన్మానం...**

ఎమ్మెల్యే హోదాలో మొదటిసారి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిని మండలంలోని ఆయా గ్రామాల నుంచి మనూర్‌కు చేరుకున్న ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌నాయకులు సోమవారం బాజాభజంత్రీలతో స్వాగతంపలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, రామచందర్, మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, సాయిలు, వినోద్ పాటిల్, పోతుల సంగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, న్యాయవాది సంగన్న, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



అయ్యప్పస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

## అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

**మెదక్ అర్బన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప మాలధారణ స్వాములకు మండల కాలం పాటు నిత్య అన్నధాన, అల్పాహార కార్యక్రమం నిర్వహిస్తున్న దాత ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం అయ్యప్ప ఆలయాన్ని సందర్శించి అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నిత్యాన్నదాన, నిత్య అల్పాహారానికి సంబంధిత రుసుమును నిర్వాహకులకు ఎమ్మెల్సీ అందజేశారు. అందరు స్వాములకు దక్షిణ అందజేసి పాదాభివందనం చేశారు. ఆలయ కమిటీ నాయకులు,నిర్వాహకులు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు దేవాగౌడ్, మహిపాల్‌రెడ్డి, యామిరెడ్డి, సాయాగౌడ్, శ్రీను నాయక్, ఎంపీటీసీ సిద్ధిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పురం వెంకట నారాయణ, ఏఎంసీ డైరెక్టర్ కొండా శ్రీను తదితరులు ఉన్నారు.

## ప్రజల పక్షాన నిరంతరం పోరాడతాం
### మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**పెద్దశంకరంపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఓటమికి కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహ పడాల్సిన అవసరంలేదని, అధికారం లో ఉన్నా, విపక్షంలో ఉన్నా ప్రజల మధ్యే ఉండాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమ వారం కమలాపురం గ్రామంలో స్థానిక సర్పంచి కుంట్ల రాములు సొంత ఖర్చులతో గ్రామ అవసరాల కోసం ఏర్పాటు చేసిన అంబెలెన్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పెద్దశంకరంపేట పార్టీ కార్యాలయంలో నాయకులు,కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రజలతోనే ఉన్నామని, ఇకమీదట అందరం ప్రజలతోనే కలిసి ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చెందే విధంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన విధంగా 9వ తేదీన రుణ మాఫీ, వరి రైతులకు బోనస్, యాసంగి సీజన్‌కు రైతుబంధు, రైతు కూలీలకు రూ.12 వేలు ఎప్పు డిస్తారో ప్రకటించాలన్నారు. ఆరుగ్యారంటీలలో ఒక గ్యారంటీ పూర్తి అమలు జరుగలేదని, మహిళలకు రూ.2,500, రూ.500 వంట గ్యాస్, అమలుచేస్తే ఒక గ్యారంటీ పూర్తవుతుందని, నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ వెంటనే ప్రకటించాలని పేర్కొన్నారు. నారాయణఖేడ్‌లో మహిళలకు ఉచితబస్సు ప్రయాణం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించకుండా వ్యవహరిస్తున్నారని, ఇది పునరావృతం కాకుండా అధికారులు చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశాల్లో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు విజయ రామరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీ పంతులు, సురేష్‌గౌడ్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## కస్తూరిభా బాలికల పాఠశాలను సందర్శించిన అసిస్టెంట్ డైరెక్టర్



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ విజయ

**వెల్దుర్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ విజయ, జీసీ ఈసీవో సుకన్య సందర్శించి పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని వారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా, లేదా అని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతిరోజు పాఠశాలలో తయారు చేసిన భోజనాన్ని ఫోటోల ద్వారా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఖచ్చితంగా వాట్సాప్‌లలో పెట్టించుకుంటున్నామని వారు తెలిపారు. జిల్లాలో ఉన్న పదిహేను పాఠశాలల్లో సోలార్ హీటర్లు, త్రాగునీటి సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక సోమవారం పూజలు



చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**మెదక్ అర్బన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** పట్టణంలోని కార్తీక సోమవారం సందర్భంగా శ్రీభవాని శంకర్ ఆలయంలో మహన్యాస పారాయణ పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల వేద మంత్రాలు పఠించారు. తిరిగి సాయంత్రం భవానిశంకర కళ్యాణ ఘట్టం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాల్లో పాల్గొని విజయంతంచేసిన భక్తులకు అర్చకులు లింగమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

## వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు స్కానర్, ప్రింటర్ అందజేత

**వెల్దుర్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న ప్రముఖ వ్యాపారవేత్త ఎన్. రమేష్‌గౌడ్ సోమవారం అదే పాఠశాలకు విద్యార్థులకు అవసరమైన 20 వేల రూపాయల విలువ చేసే స్కానర్, ప్రింటర్‌లను పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. గతంలో విద్యార్థులకు బ్యాండ్ కావాలని కోరగా విద్యార్థుల కోరిక మేరకు బ్యాండ్ అందించడం జరిగిందన్నారు. నేడు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు ఒక మైక్‌సెట్ కావాలని కోరగా ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కర్రె వెంకటేశం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమేశ్వర ఆలయంలో కార్తిక సోమవారం పూజలు

**చిన్నశంకరంపేట, నవంబర్ 11,ప్రభాతవార్త:** కార్తీక సోమవారం సందర్భంగా శ్రీసోమేశ్వర ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో యజ్ఞం నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజు సోమవారం కావడంతో భక్తులు ఆలయానికి పోటేత్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.



శ్రీసోమేశ్వర ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న వేద పండితులు

# మహిళలతో కళకళలాడుతున్న ఆర్టీసి బస్సులు

**-ఆదాయం పడిపోయిందని వాపోతున్న ఆర్టీసి ఉద్యోగులు**

**- ప్రయాణీకులు లేక నిలిచిపోతున్న ప్రైవేటు వాహనాలు**



మహాలక్ష్మి పథకం ప్రారంభం కాగానే మహిళలతో కలకలలాడుతున్న ఆర్టీసి బస్సులు



**కందుకూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**
మహాలక్ష్మి పథకం ద్వారా బస్సులలో రద్దీ పెరిగిందని ఆదాయం తగ్గిందని ఈ పరిస్తితులు ఎటువైపు దారితీస్తాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. ఈ నెల 9 వతేదీ మద్యాహ్నం కాంగ్రేస్ ప్రభుత్వం ఎన్నికల హమీలో బాగంగా ఆర్టీసి బస్సులు (ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్) లలో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయానం చేయవచ్చని ప్రకటించింది. చిన్నపిల్లలు మొదలు పెద్దలవరకు ఈ అవకాశం ఉంటుందని పథకాన్ని సిఎం రేవంత్‌రెడ్డి లాంచనంగా ప్రారంబించడం జరిగింది. ఈ సమాచారం మారుమూల ప్రాంతాలకు సహితం దావాహనంలా వ్యాపించడంతో బస్సులలో మహిళ ప్రయానం ఒక్కసారిగా పెరిగిపోయింది. బస్సులలో పురుషుల సంఖ్య 10 శాతం ఉంటే మిగతాబాగం మహిళలే ఆక్రమించారని కండక్టర్లు పేర్కొంటున్నారు. ఇబ్రాహింపట్నం డిపొ బస్సు కద్తాల నుండి బయలుదేరి వయా ముచ్చర్ల, కుర్మిద్ద, మీర్ఖాన్‌పేట, నందివనపర్తి, యాచారం, ఇబ్రాహింపట్నం మీదుగా హైద్రాబాద్ వెలుతుందని కరోణా సమయంలోను ఈ బస్సు అగలేదని ఆర్టీసికి బారీగా అదాయాన్ని తెచ్చిపెట్టేదని గత రెండు రోజులుగా అదాయం సుమారు 65 శాతం పడిపోయిందని కండక్టర్ పేర్కొన్నారు. ఇలా కప్పాడు బస్సులో కప్పాడు గ్రామం నుండి ఇబ్రాహిపట్నం 65 మంది ప్రయానం చేస్తే అందులో 3 నుంది డికట్ పంచింగ్ జరిగిందని ఒక లగేజీటికట్ కట్ అయ్యిందని ఇబ్రాహింపట్నం నుండి మీర్ఖాన్‌పేట వచ్చే బస్సులో 55 మంది ప్రయానం సాగిస్తే స్టాటింగ్ పాయింట్ వద్ద 8 మందికి మాత్రమే టికెట్ కట్‌చేయడం జరిగిందని కండక్టర్ తెలిపారు. కద్తాల బస్సులో డ్యూటీచేసే కండక్టర్ అనుసూయ మాట్టాడుతు తన 14 సంవత్సరాల సర్వీసులో ఆర్టీసి బసులో ఇంత పెద్ద సంఖ్యలో మహిళల ప్రయానించిన ధాఖలాలు లేవని, పెళ్ళిల సమయంలోను, పండుగల సమయంలోను చూడలేదని పేర్కొన్నారు. కప్పాడు బస్సు కండక్టర్ సహితం ఇదే అనుభవాన్ని వ్యక్తం చేశారు. టికెట్ తీసుకునేవారి సంఖ్య తగ్గడం వలన తీసుకోని వారిసంఖ్య పెరగడం వలన చిల్లరసమస్య పెరిగిందని క్యాష్ బ్యాగులు కాలీగా కనిపిస్తున్నాయని కండక్టర్లు పేర్కొంటున్నారు. ఈ విషయమై ప్రయానీకులు బిన్నవాదనలు వినిపిస్తున్నారు. చదువుకునే విద్యార్థినులకు ఈ అవకాశాన్ని పెట్టిఉంటే విద్యార్థులను ప్రోత్సహించినట్లుగా ఉండేదని ఉన్నతవిద్య చదువుకోవడానికి ఉత్సాహంగా వెల్లేవారని. అసరా పించన్లు పొదేవారికి, మహిళా రైతులకు ఈ అవకాశం ఇస్తే సరిపోయేదని, లేదంటే బస్సుచార్జీలను సగం తగ్గించి ఉంటే సరిపోయేదని చాలవరకు ఈ అవకాశం దుర్వినియోగం అయ్యేవిదంగా కనిపిస్తుందని మహిలలు పేర్కొంటున్నారు. ఈ విధానం వలన ఆర్టీసి కనమరుగయ్యే పరిస్తితులు ఉంటా యని ఉద్యోగులు ప్రజలు అభిప్రయాపడుతున్నారు.
కాంగ్రేస్ పార్టీ ప్రభుత్వం ప్రకటించిన సిలిండర్ గ్యాసు రూ 500 ఇస్తామనే పద్దతి బాగుందని అలానే ఆర్టీసిని రక్షించుకునే విదంగా దరలను తగ్గించి ప్రజల బాద్యతను గుర్తిచే విదంగా చూడాలని ఉపయోగం లేకపోయినా మహిళలు ప్రయాణం పెరిగితే ప్రయోజనం ఉండదని అన్నివిదాలా నష్టదాయకమేనని అర్థిక వనరులు ఉత్పత్తిదాయక అంశాలపైన ఇలాంటి అవకాశాలు కల్పిస్తే ప్రయోజన కరంగా ఉంటుందని లేదంటే ప్రయోజనం ఉండదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజా రవాణా సంస్థ నిలవాలంటే ఈ విషయంలో ప్రభుత్వం ప్రజల అబిప్రాయాలను తీసుకోవాలని సత్పలితాలు ఇచ్చే విదంగా చర్యలు చేపట్టాలని విశ్లేషకులు పేర్కోంటున్నారు. మహిళలకు ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణం ప్రకటన ప్రభుత్వం నుండి రాగానే మహిళలు ప్రైవేటు వాహనాలను వదిలి ఆర్టీసి బస్సులవైపు చూస్తున్నారు దాంతో ఇప్పటివరకు రోడ్లపైన పరుగులు పెడుతున్న ప్రైవేటు వాహనాలు ప్రయానీకులు లేక రోడ్లపైన పడిగాపులు కాస్తున్నాయి. జీవనోపాధికోసం సంవత్సరకాలంగా ప్రైవేటు వాహనాలు ఆటోలను టెంపోవ్యాన్‌లను, ట్యాక్సీలను నడుపుతు జీవనం సాగిస్తున్న ప్రజలు తమ ఉపాది అవకాశాలను కోల్పోతున్నారని మహాలక్ష్మి పథకం ప్రైవేటు వాహనాలు నడుపుకుంటు జీవనం సాగించే వారికి సమస్యగానే మారిందని నిన్నమొన్నటివరకు కొద్దో గొప్పో సంపాదన ఉండేదని నేడు అదాయం ఒక్కసారిగా పడిపోయిందని కుటుంబ ఫోషన భారంగా మారుతుందని అప్పులు చేసి వాహనాలు కొనుగోలు చేసినమాకు అప్పుచెల్లించేది ఎట్లా కుటుంబ పోషనసాగేదెట్లా అని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ విషయాలను ప్రభుత్వం అలోచించాలని తమకు ఉపాది మార్గం చూపాలని అయా వాహనాలను నడుపుకుంటు జీవనంన సాదిస్తున్న వాహనచోదకులు డిమాండ్ చేస్తున్నారు. మహాళక్ష్మిపథకం ఎంతవరకు సత్పలితాలు ఇస్తాయో చూడాలి.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేలం పాట



**తలకొండపల్లి డిసెంబరు11,ప్రభాతవార్త :**
శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కొబ్బరికాయలు,లడ్డు పులిహోర వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఈవో స్నేహలత,సర్పంచ్ శ్యాం సుందర్ రెడ్డి ,జంగారెడ్డిపల్లి సర్పంచ్ వరలక్ష్మి రాజేందర్ రెడ్డి ,మెదక్‌పల్లి ధరణి శివశంకర్ రెడ్డిలు హాజరైయ్యారు. ఈ వేలం పాటలో కొబ్బరికాయలు 46వేలకు ,పులిహోర లడ్డులను 30వేలకు భద్రప్ప దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్థులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మణెమ్మ యాదయ్య,మాజీ ఎంపిటిసిలు తిక్కల వెంకటయ్య, యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**తలకొండపల్లి డిసెంబరు11,ప్రభాతవార్త :**
ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి కిష్టమ్మ పేర్కొన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్టేట్ సెంటర్‌ను సర్పంచ్ దాసరి కిష్టమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....నేటి నుండి వారం రోజుల పాటు ఆధార్ సెంటర్ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మహదేవుని కృప కొరకు...మహాపాదయాత్ర

**-సన్మానించిన నందిగామ అయ్యప్ప స్వాములు**



సుదర్శన్ గౌడ్‌కు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

**నందిగామ డిసెంబరు11,ప్రభాతవార్త :**
భక్తిమార్గం ద్వారానే ముక్తి మార్గం లభిస్తుందని గురుస్వామి వంకాయల రాంరెడ్డి అన్నారు. నందిగామ గ్రామం నుండి పాదయాత్ర ద్వారా శబరిమల వెళ్లి అయ్యప్ప దైవదర్శనం చేసుకొని క్షేమంగా ఇంటికి వచ్చిన నందిగామ గ్రామానికి చెందిన కేశమోని మల్లేష్ యాదవ్‌ను సోమవారం నందిగామ అయ్యప్ప స్వాములు ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అణువణువునా అడుగడుగునా అయ్యప్ప నామస్మరణతో నడిచి అలుపెరగని ఉత్సాహంతో శబరిమల చేరుకొని స్వామిని దర్శించుకొని వచ్చిన మల్లేష్‌ను అభినందించారు. ఈ వేడుకల్లో అయ్యప్ప స్వాములు బి. జంగయ్య స్వామి,చించేటి కృష్ణ గౌడ్,శ్రీకాంత్ గౌడ్,రాజకుమార్, సుబ్బు,బి.కృష్ణ యాదవ్,బి.లింగం గౌడ్,శేఖరప్ప,ఉన్నారు.

## అన్నా...అంటే నేనున్నా అనే భరోసా

**-క్షేతగాత్రుని పరామర్శించిన ఎమ్మెల్యే**



**నందిగామ డిసెంబరు11,ప్రభాతవార్త :**
ఆపదలో ఉన్నా అంటే నేనున్నా అనే భరోసాను చేతల ద్వారా నిరూపించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నందిగామ మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ (29) ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనలో శ్రీకాంత్ తలకు,కాళ్లకు తీవ్ర గాయాల పాలు కావడంతో కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం శంషాబాద్ లీమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగినట్లు సమాచారాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హుటాహుటిన శంషాబాద్ లీమ్స్ ఆస్పత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో శ్రీకాంత్ కుటుంబీకులను పరామర్శించిన అనంతరం చికిత్స పొందుతున్న శ్రీకాంత్ ఆరోగ్య పరిస్థితిని అక్కడున్న డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఏం భయాందోళన చెందవద్దని ఆసుపత్రిలో వైద్యం కోసం శ్రీకాంత్‌కు అయ్యే ఖర్చులన్ని తానే భర్తిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇవ్వడంతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వీర్లపల్లి సర్పంచ్ చిందం రాములమ్మ కుమారుడు చిందం నరసింహ ఉన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



మృతదేహనికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**తలకొండపల్లి డిసెంబరు11,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల్ల కర్నాస్ తండాకు ఎందిన కేతావత్ బాలు ప్రమాదానికి గురై ఆకస్మికంగా మృతి చెందాడు. సోమవారం విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేతావత్ ఆకస్మికంగా చెందాడం కుటుంబానికి తీరనిలోటు అని ఆయన ఆవేదన వ్యక్త పరిచారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. తక్షణ సాయంగా మూడు వేల రూపాయలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట సోదరుడు కసిరెడ్డి వెంకటరెడ్డి, ఖానాపూర్ మాజీ సర్పంచ్ శంకర్ నాయక్,మృతుని కుటుంబ సభ్యులు,తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి డిసెంబరు11,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కుమ్మరి పెంటయ్య అనారోగ్యంతో మృతి చెందారు ఈ విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ అధ్యక్షుడు దోకూరు ప్రభాకర్ రెడ్డి సహకారంతో 3వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా,డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్,అసెంబ్లీ సోషల్ మీడియా ఇన్‌చార్జీ అజీమ్,యూత్ కాంగ్రెస్ నాయకులు మల్లేష్ యాదవ్,యాదగిరి,వెంకటేష్, ఆంజనేయులు,సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికలకు అధికారులు సంసిద్ధంగా ఉండాలి

**-మేడ్చల్ కలెక్టర్ గౌతమ్**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టరన గౌతమ్,పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 11, ప్రభాతవార్త**
రానున్న ఎన్నికలకు అధికారులు సంసిద్దంగ ఉండాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం నగరం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అదికారి వికాస్‌రాజ్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించటంతో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండ పాటిస్తూ అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఎన్నికల విదులు నిర్వహించటంలో సమీక్షలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాను మరో సారి సమగ్రంగ పరిశీలిస్తామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడ ఓటరు జాబితా నుంచి తప్పిపోకుండ చూస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. దీనికి సంబంధించి జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికల కోసం ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాలు పలు అంశాలపై ఏర్పాట్లకు సిద్దంగ ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే బలంగా టిఎన్‌జిఓస్ యూనియన్ ముందుకు



టిఎన్‌జిఒస్ యూనిట్ ఎన్నికల్లో గెలుపొందిన వారిని అభినందించిన మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఒస్ అధ్యక్షులు, ఉద్యోగుల జెఎసి అధ్యక్షులు బి.రవిప్రకాశ్,పాల్గొన్న టిఎన్‌జిఒస్ నాయకుల దృశ్యం

**-ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఉంటే కలెక్టర్ దృష్టికి తెస్తాం**

**-యూనిట్‌కు ఎన్నికైన అధ్యక్ష,కార్యదర్శికి ప్రశంసలు**

**-మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ అధ్యక్షులు బి.రవిప్రకాశ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 11, ప్రభాతవార్త**
ఐక్యతనే బలంగ టిఎన్‌జిఒస్ యూనియన్ ముందుకు వెళ్తుందని, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఉంటే యూనియన్ ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఒస్ అధ్యక్షులు, ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్ పేర్కొన్నారు. జిల్లాలోని టిఎన్‌జిఒస్ యూనిట్స్ పదవుల కమిటీల ఖాళీల భర్తీ చేయాలని ఇటీవల జరిగిన జిల్లా సమావేశంలో నిర్ణయించినట్లు ఈ మేరకు ప్రజాస్వామ్య పద్దతిలో సోమవారం టిఎన్‌జిఒస్ కేంద్రకమిటీ సభ్యులు ఎన్నికల అధికారులు పాలుబై ఈశ్వర్, జిల్లా కార్యదర్శి భరత్‌లు ఎన్నికలను న్యాయబద్దంగ నిర్వహించారు. ఖాళీగ ఉన్న శామీర్‌పేట మండల యూనిట్‌కు అధ్యక్షులుగ గంగుల రవియాదవ్ (ఎఇఒ)ను, మండల కార్యదర్శిగ శైలేప ల్యాన్ (ఐటిఐ) ఎటిఒను సభ్యులు ఎన్నుకోవటం జరిగిందన్నారు. ఎన్నికైన వారిని జిల్లా అధ్యక్షునితో పాటు పలువురు అభినందించారు. ఈ సందర్భంగ జిల్లా అధ్యక్షులు బి.రవిప్రకాశ్ మాట్లాడుతూ శామీర్‌పేట మండల యూనిట్‌లోని సభ్యులందరి సమస్యలను ఆకాంక్షలను,సంక్షేమాన్ని ఈ సంఘానికి తీసుకవెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తుందని, ఉద్యోగులు ఏ సమస్య వచ్చినా కలెక్టర్ దృష్టికి తీసుకవెళతామని, టిఎన్‌జిఒస్ ఐక్యత బలంతో ముందుకు వెళతామన్నారు. యూనియన్ ఉద్యోగుల హక్కులను సాధించటానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో వారితో పాటు జిల్లా కమిటీ సభ్యులు శ్రీచంద్, ఐటిఐశాఖ అధ్యక్షులు రవీందర్, పంచాయతీ కార్యదర్శిల ఫోరం అధ్యక్షులు భాస్కర్, మేడ్చల్ యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్, వినయ్ షిర్లీ, తదితరులు పాల్గొన్నారు.

# మెథడిస్ట్ చర్చి ప్రాంగణంలో మురుగు నీరు తొలగించాలి



మొయినాబాద్ మెథడిస్ట్ ప్రాంగణంలో ఉన్న మురికి నీరు తొలగించాలని ఎంపిడివోకు వినతిపత్రం అందించిన మొయినాబాద్ మెథోడిస్ట్ జిల్లా అధికారి రెవ.పి.విజయరావు తదితరులు

**మొయినాబాద్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:**
మొయినాబాద్ మెథడిస్ట్ ప్రాంగణంలో ఉన్న మురికి నీరు తొలగించి త్వరలో జరిగే క్రిస్మస్ వేడుకలకు ఇబ్బంది లేకుండా చూడాలని మొయినాబాద్ మెథోడిస్ట్ జిల్లా అధికారి రెవ.పి.విజయరావు మొయినాబాద్ ఎంపిడివో సంధ్యను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎంపిడివోను కలిసి వినతిపత్రం అందజేశారు. అండర్ డ్రైయినేజీ వాటర్ లీక్ కావడం వల్ల మురుగు నీరు చేరి గ్రౌండ్ అంతా దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. మురుగునీరు గ్రౌండ్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపిడివో సంధ్య మాట్లాడుతూ ఈ విషయాన్ని వెంటనే సంబంధిత అధికారుల చేరవేస్తానని తెలిపారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు గ్రామ మెథడిస్ట్ నాయకులు ఎర్రోళ్ల ప్రేమ్‌కుమార్, బక్క ప్రభాకర్, మొయినాబాద్ మెథడిస్ట్ జిల్లా యూత్ అధ్యక్షుడు కాడిగళ్ల ప్రణయ్‌కుమార్, అడ్వయిజర్ చేవెళ్ల ప్రభచారం, చిల్కూర్ మెథడిస్ట్ చర్చ్ పాస్టర్ రెవ.సామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ రెన్యూవల్‌కు ఖాతాలో డబ్బులు ఉంచుకోవాలి : మేనేజర్ కళ్యాణ్



మల్కిజ్‌గూడ గ్రామంలో ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ కళాబృందం

**యాచారం డిసెంబరు11,ప్రభాతవార్త :**
తెలంగాణ గ్రామీణ బ్యాంకు యాచారం శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్కీజ్ గూడ గ్రామంలో ఆర్థిక అక్షరాసత్యపై మేనేజర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు వారు కళాకారుల బృందం చే బ్యాంకులో ఉన్న పథకాల గురించి అవగాహన కల్పించారు. అలాగే ఇన్సూరెన్స్ చేసుకున్న వారు యుపిఐ వాడటం వల్ల ఖాతాలలో డబుబ్లు ఉంచడం లేదని రెన్యువల్ కొరకు కచ్చితంగా డబ్బులు ఉంచుకోవాలని తెలిపారు. ఖాతాదారులకు ఇన్సూరెన్స్ యొక్క ప్రాధాన్యత గుర్తించి క్లుప్తంగా వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకుల్లో సరైన సమయానాకి డబ్బులు చెల్లించుకోవాలని విధిగా ఉండాలని కోరారు.

## సుదర్శన్ గౌడ్‌కు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

**ఆదిభట్ల డిసెంబరు11,ప్రభాతవార్త :**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్ గౌడ్ తండ్రి పల్లే సుదర్శన్ గౌడ్ (75) గుండెపోటుతో కామినేని హాస్పిటల్లఓ చికిత్స పొందుతూ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మరియు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి నాయకులతో కలిసి పార్థవ దేహానికి నివాళులర్పించారు. పల్లె గోపాల్ గౌడ్ కుటుంబాన్ని మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధైర్య పడోద్దు అని ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీలో సీనియర్ నాయకుని కోల్పోయామని పేర్కొన్నారు.



సుదర్శన్ గౌడ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

## మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఘట్‌కేసర్‌లో ఎన్నికైన మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం

**ఘట్‌కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఘట్‌కేసర్ ఎదులాబాద్‌రోడ్డులోని ఎస్ఎం ఫంక్షన్‌హాలులో సంఘం నాయకులు, సభ్యులు సమావేశమై సంఘం అభివృద్ధిపై చర్చించారు. ఈసందర్భంగా ఏకాభిప్రాయంతో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఘట్‌కేసర్ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా మన్నె నందు, ప్రధాన కార్యదర్శిగా దంతాల అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బొర్ర రవికుమార్, కోవ రాం మోహన్, కోశాధికారిగా కొటారి వేణకుమార్, సంయుక్త కార్యదర్శిగా బిట్ల మల్లేశ్, బచ్చనగోని అశోక్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బిట్ల అనిల్‌కుమార్, ఎర్ర బోతు రాజ్‌కుమార్, మొలకసీమ హరగోపాల్, సలహాదారులుగా బొర్ర సభాపతి, ఐనాల విష్ణు, చింతపండు ఆత్మారాంలు ఎంపిక అయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలదండలతో సన్మానించారు.

## రక్తదానంతో ప్రాణధానం చేసే అవకాశం



ఘట్‌కేసర్‌లో రక్తదాన శిభిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్, కౌన్సిలర్ జహంగీర్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**
రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులను కాపాడవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డిలు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బుగ్గానగర్‌లోని సెయింట్ అంథోనీస్ పాఠశాలలో రక్తదాన శిభిరం నిర్వహించారు. మెల్విన్ ఫిట్‌నెస్ జిమ్ సహకారంతో రెండవసారి రక్తదాన శిభిరం ఏర్పాటు చేయగా మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, ఎంపిపి సుదర్శణ్‌రెడ్డి లు విచ్చేసి శిభిరాన్ని ప్రారంభించారు. శిభిరంలో 50 మంది రక్తదానం చేయగా దాతల నుంచి బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, వార్డు కౌన్సిలర్ షేక్ జహంగీర్, పాఠశాల వ్యవస్థాపకులు జార్జ్‌క్విల్డెన్, కరస్పాండెంట్ క్రిస్టీనా క్విల్డెన్ ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొగ బాబు, బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ మహేందర్, స్టాఫ్ నర్స్ లావణ్య, స్వప్న, వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్తీకం ప్రత్యేక పూజ..భక్తులకు అన్నదానం



స్వాములకు భోజనం వడ్డిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలోని శ్రీభ్రమరాంబమల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నెలరోజులుగా ఆలయంలో కార్తీకమాస పూజలు ఘనంగా జరుగుతుండగా ప్రతి సోమవారం అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఉదారి సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి విచ్చేసి స్వామికి అభిషేక పూజలు చేశారు. అయ్యపస్వాములకు ఆయన భోజనాలు (బిక్ష) వడ్డించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి గట్టగళ్ల రవి, మాజీ ఎంపిటిసి మంకం రవి, ఆయల ధర్మకర్తలు కంట్లం శంకరప్ప, శివకుమార్, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## రేపు సర్వసభ్య సమావేశం

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 11,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో బుదవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ మహేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు. అలాగె మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు తప్పని సరిగగా హాజరు కావాలని ఆయన కోరారు. ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని ఆయన పెర్కొన్నారు.

## మైసిగండిలో ఎమ్మెల్యే కాసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి

**కడ్తాల్, డిసెంబరు 11 ప్రభాతవార్త :**
కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మొదటిసారి ఎమ్మెల్యే ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే ఎన్నికై మొదటిసారి కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయానికి కసిరెడ్డి నారాయణరెడ్డి, మండల ప్రజాప్రతినిధులు చేరుకోగా ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ప్రధాన అర్చకులు వారిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డిని ఆలయ ట్రస్టీ, ఈఓ, ఆలయ అర్చకులు శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాట నరసింహ ముదిరాజ్, ఎంపిటిసి సభ్యులు గుడురు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీనాయకులు గుడురు భాస్కర్‌రెడ్డి, గిరిజన నాయకులు హన్మనాయక్, డిసిసి కార్యదర్శి బిక్యనాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్యానాయక్, కో ఆప్షన్ సభ్యులు జంగిర్‌బాబా, మాజీ సర్పంచ్‌లు శేఖర్‌గౌడ్, ఆనంద్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, మాలే మల్లేష్‌గౌడ్, హీరాసింగ్, బాలరాజు, జోహాల్ లాల్‌నాయక్, చేగురి వెంకటేశ్, లక్ష్మయ్య, కిషన్, రాహుల్, ఆలయ అర్చకులు మాదారం యాదగిరి, ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

## ఈకేవైసి కోసం బారులు తీరిన మహిళలు



భారత్ గ్యాస్ ముందు ఈకేవైసీ కోసం బారులు తీరిన మహిళలు

**షాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటిలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తామని ఎన్నికల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆరు గ్యారంటిల్లో మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో వినయోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ కార్యాలయం ముందు ఈకేవైసీ చేసుకునేందుకు వినియోగదారులు బారులు తీరారు. -ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500గ్యాస్ సిలిండర్ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ముందస్తుగా మండలంలోని భారత్ గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని భారత్ గ్యాస్ డీలర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



హైతాబాద్‌లో పడిపూజలో పాల్గొన్న స్వాములు

**షాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**
స్వామియే శరణం అయ్యప్ప అంటూ హైతాబాద్ మార్మోగింది. షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో నర్సింలు స్వామి ఏర్పాటు చేసిన పడిపూజ కార్యక్రమానికి శ్రీగోపాల్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ య్యప్ప స్వాములు పాడిన పాటల కు భక్తులు మంత్రముగ్దులయ్యారు. ఆయా గ్రామాల స్వాములు తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ సమావేశానికి అధికారులు హాజరుకావాలి

### -మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి

**కొడంగల్, డిసెంబర్ 11ప్రభాతవార్త**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 14న నిర్వహిస్తున్న మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్దానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు పట్టణంలోని మంజునాథ మినీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న సమావేశంలో కొడంగల్ అభివృద్ది భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న అతి మఖ్య సమావేశానికి అన్ని శాఖల హెచ్‌ఓడి అధికారులు విధిగా హాజరుకావాలని తెలిపారు. అంతేగాక మున్సిపల్ పరిధిలో చేపట్టనున్న అభివృద్ది పనులపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మునీర్, డీడీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు లోకూర్తి జయతీర్థాచారీ, మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపే యాచారం మండల సర్వసభ్య సమావేశం

**యాచారం డిసెంబరు11, ప్రభాతవార్త :**
మండల సర్వసభ్య సమావేశం 13న బుధవారం ఎంపిపి కొప్పు సుకన్య భాష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు యాచారం ఎంపిడివో విజయలక్ష్మి పేర్కొన్నారు. సమావేశం ఉదయం 11గంటలకు సమావేశం మందిరంలో ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖ అధికారులు సమయపాలన పాటించి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఎంపిపి కొప్పు సుకన్య భాష, జడ్పిటిసి చిన్నోల్ల జంగమయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం, పత్తి కొనుగోళ్ళు చేయాలి

### -జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**వికారాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**
రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వరి ధాన్యం, పత్తి కొనుగోలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలు, సూచనల మేరకు అధికారులు పనిచేయాలన్నారు. రైతులకు పాసు పుస్తకాలు లేనట్లయితే వ్యవసాయ అధికారుల ధృవీకరణ పత్రాలను పరిగణలోకి తీసుకుని వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, హరితహారం, నర్సరీ పనులు చేపట్టాలని ఆయన తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల ద్వారా మంజూరు అయిన పనులు, కొనసాగుతున్న పనుల విషయాలను సంబంధిత నియోజకవర్గాల శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లాలని సిపిఓ కు సూచించారు. పంచాయత్ రాజ్, ఆర్‌అండ్‌బి ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై ఎమ్మెల్యేలకు సమాచారం ఉండాలని కలెక్టర్ తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఎన్నికల ప్రక్రియకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విధులు నిర్వహించాలని డిపిఓ ను ఆదేశించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారిని కలెక్టర్ ఆదేశించారు. దారూర్‌లో జాతర ముగిసినందున పారిశుద్ధ్య పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. పరిగిలో నిర్వహించే ఇస్తమా కార్యక్రమానికి సంబంధించి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో 105 అర్జీలు రాగా, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కార దిశగా సంబంధిత శాఖల అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచ్, మాజీ సర్పంచ్‌ల పరస్పర దూషణలతో రసాభాసగా గ్రామసభ

### -గ్రామంలో 6 నెలలుగా చేత్త సేకరణ చేయడం లేదని బాలాజీ నగర్ వాసుల ఆందోళన



కొర్రెముల గ్రామసభలో సమస్యలను వివరిస్తున్న బాలాజీ నగర్ కాలనీవాసి.

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**
గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రజలకు కనీసా వసతులు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతుందని గ్రామసభకు విచ్చేసిన సభ్యులు ఆరోపించడంతో గ్రామసభ రసాభాసాగా మారింది. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామ సభ సర్పంచ్ ఒరుగంటి వెంకటేశ్ గౌడ్ అధ్యక్షతన సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నాగరాజు ప్రజల పక్షాన మాట్లాడేందుకు యత్నించగా మాజీ సర్పంచ్‌ను మీరు మాట్లొడద్దని కార్యదర్శి కవిత, సర్పంచ్ వెంకటేశ్ గౌడ్‌లు వారించేందుకు యత్నించగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఓ దశలో సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు పరుషపదజాలంతో పరస్పరం వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారు. దీంతో సమావేశాన్ని పూర్తిస్థాయిలో చర్చ జరుగకుండానే ముగించేశారు. అంతకు ముందు గ్రామ సభకు విచ్చేసిన గ్రామంలోని బాలాజీనగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఆరు నెలలుగా చెత్త సేకరణ చేయడం లేదని గ్రామసభలో కార్యదర్శిని ప్రశ్నించారు. దీంతో సర్పంచ్ కలుగజేసుకుని కాలనీలో చెత్త సేకరణ పంచాయతీ చేపట్టడం లేదని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించామని వారే చూసుకుంటున్నారని మీ కాలనీలో చెత్తను మీరే తీసుకోవాలని ఎవరైన ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలని తెలిపారు. కనీసం కాలనీల్లో చెత్త సేకరణ చేపట్టకుండా పంచాయతీ వారు ఎమి చేస్తున్నారని కాలనీవాసులు ధనంజయ గౌడ్, కొమ్రయ్యలు ప్రశ్నించగా కాలనీల్లో చెత్త సేకరణ చేయడం లేదని అన్నారు. కాలనీలో మిషన్ భగీరథ తాగునీటి వసతి లేదని, వీధి లైట్లు లేవని, సీసీ రోడ్లు అంతంత మాత్రమే ఉన్నాయని డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయలేదని కాలనీవాసులు గ్రామసభలో ప్రశ్నించగా తానే స్వంతంగా 40 లక్షల పంచాయతీలో ఖర్చు చేశానని మరో 50 రోజుల్లో పదవి దిగిపోతానని తాను పెట్టిన పైసలు వస్తాయే రావోనని సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి గ్రామాలకు మంచినీళ్లు వస్తాయని మిగతా పనులు పంచాయతీల్లో నిధులు చేయడం లేదని జవాబిచ్చారు. గ్రామంలో పలువురు మాట్లాడుతూ పలుచోట్ల వీధి దీపాలు లేవని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. పలు దేవాలయాల వద్ద నీటి వసతి లేదని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. కొత్తగా నిర్మించిన దేవాలయంలో అమ్మవారిని దర్శించుకోకుండా గుడికి తాళం వేస్తున్నారని గ్రామస్తుల అందరి సహకారంతో నిర్మించిన గుడిపై కొందరి ఆజామాయిషీ ఏమిటని గ్రామ కాంగ్రెస్ నాయకుడు బాస్కర్ గౌడ్ ప్రశ్నించారు. సీఎం మారాడని పాత సీం పోటో తీసివేసి కొత్త సీఎం పోటోను పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేత కార్యదర్శి దృష్టికి తెచ్చారు. మాజీ సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ గ్రామం గుండా నిర్మితమౌతున్న ఆర్ అండ్ బీ రోడ్డు పనులు త్వరితగతిన అయ్యేవిధంగా పాలకవర్గం చొరవ తీసుకోవాలని గ్రామ సభకు సూచించారు. పంచాయతీ పరిధిలోని సర్వేనెంబరు 734లో 198 గజాల పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా పంచాయతీ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గజం 40 వేలు పలికే పార్కు స్థలాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మకై ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు యత్నిస్తున్నారని మాజీ సర్పంచ్ ఆరోపించారు. ఇకనైనా పంచాయతి కార్యదర్శి స్పందించి పార్కు స్థలంలో బోర్డు నాటించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, సర్పంచ్ మధ్యన తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగడంతో గ్రామ సభను కార్యదర్శి ముగించిజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ బొడ్డు వినోద, ఉప సర్పంచ్ కందుల కుమార్, కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు యెరుకల దుర్గారాజు గౌడ్, బాస్కర్, బాబు, ఆంజనేయులు, మన్యం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్లారెడ్డికి సన్మానం



గుండ్లపోచంపల్లిలో ఎమ్మెల్యే మల్లారెడ్డిని సన్మానించిన నాయకులు

**మేడ్చల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**
మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని గుండ్లపోచంపల్లిలో నాయకులు సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన మల్లారెడ్డికి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లిలో ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తన గెలుపుకు శాయశక్తులా కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేసి, రెండో సారి తనకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, పెంటయ్య, శైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు



మేడ్చల్‌లోని గురుకుల పాఠశాలలో జరిగిన పరుగు పందెం పోటీలు

**మేడ్చల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :**
మేడ్చల్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల తొమ్మిదవ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి, ఈ నెల 9వ తేదీ నుండి 12 వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో ఏడు జోన్‌ల 1050 మంది బాలికలు పాలు పంచుకున్నారు. అందులో భాగంగా అథ్లెటిక్స్, ఖోఖో, క్యారమ్స్ పోటీలు జరుగుతున్నాయి. సోమవారం వరకు లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, త్రీ కే రన్, 1500 మీటర్లు, 800 మీటర్లు, 600 మీటర్లు, 200 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెం పోటీలతో పాటు అండర్ 14, 17, 19 విభాగాల్లో కార్యమ్స్ పోటీలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఈస్ట్, రంగారెడ్డి రీజినల్ కో ఆర్డినేటర్ నాగ కళ్యాణి, జిల్లా కో ఆర్డినేటర్ సుధాకర్, క్రీడా పోటీల ఇంచార్జ్ రూతుమణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రభావతి, టెక్నికల్ మేనేజర్ రత్నపుష్ప, పాఠశాల ప్రధానాచార్యులు శైలజ, ఉపాధ్యాయులు, ఆద్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# 15న మెథడిస్ట్ జిల్లా క్రిస్మస్ వేడుకలు

### -మొయినాబాద్ మెథోడిస్ట్ జిల్లా అధికారి రెవ.పి.విజయరావు సామిల్



15వ తేదీన జరిగే జిల్లా క్రిస్మస్ వేడుకల స్థలం మొయినాబాద్ మెథోడిస్ట్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న మొయినాబాద్ మెథోడిస్ట్ జిల్లా అధికారి రెవ.పి.విజయరావు సామిల్ తదితరులు

**మొయినాబాద్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:**
ఈ నెల 15వ తేదీన మొయినాబాద్ మెథోడిస్ట్ జిల్లా ఆధ్వర్యంలో మొయినాబాద్ మెథోడిస్ట్ గ్రౌండ్‌లో జిల్లా క్రిస్మస్ వేడుకలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిషప్ ఎంఎ డేనియల్ హాజరవుతున్నారని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి 29 మెథడిస్ట్ ఈస్ట్ సంఘాలు పాస్టర్లు ఆయా గ్రామాల మెథడిస్ట్ చర్చ్ నెంబర్లు సంగతులు కుటుంబ సమేతంగా జిల్లా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 15వ తేదీ శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే జిల్లా క్రిస్మస్ వేడుకలను ప్రతి ఒక్కరూ పాలు పంపులు పొంది దిగ్విజయంగా ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమానికి 29 గ్రామాల మెథడిస్ట్ సంఘాల మద్దతు ఉండాలని ముందస్తుగానే సంఘ సభ్యులతో అందరు చేరుకుంటే వచ్చేటువంటి అతిథులు బిషప్ డానియల్‌ను క్రీస్తు ప్రేమ క్రిస్మస్ పాటల వేడుకలతో ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15వ తేదీన జరుగబోయే జిల్లా క్రిస్మస్ వేడుకల స్థలం మెథడిస్ట్ గ్రౌండ్ మొయినాబాద్ ఎంఆర్‌సిహెచ్ స్కూలు ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లా క్రిస్మస్ వేడుకలకు సన్నద్దమవుతున్న స్థలాన్ని ఆయన సోమవారం సందర్శించారు.

# ఆరాధనతో ముగిసిన మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర



ప్రత్యేక ప్రార్థన చేస్తున్న బిషప్‌లు



చివరి రోజు కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులు

**ధారూర్ డిసెంబరు11, ప్రభాతవార్త :**
ధారూర్ మండల పరిధిలోని స్టేషన్ ధారూర్, దోర్నాల గ్రామాల మధ్య జరిగే మెథడిస్ట్ క్రిస్టయన్ జాతర మంగళవారం ప్రారంభమై ఆదివారం ఆరాధనతో ముగిసింది. వీరంతా ప్రధాన ద్వారా వద్ద ఏర్పాటు చేసిన శిలువను దర్శించుకున్నారు. ఇప్పచెట్టును దర్శించుకుని ప్రార్థనలు చేసి కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం బిషప్ప తెలుగు, కన్నడ భాషల్లో ఏసు సందేశాన్ని వినిపించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పారిశుధ్య కోసం పంచాయతీ కార్మికులను సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. చివరి రోజు ఉంటడంతోఓ జాతరకు లక్షలలో భక్తులు తరలివచ్చారు. ఈ జాతరకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పాటు విదేశాల నుంచి లక్షలాదిగా క్రైస్తవ భక్తులు తరలివచ్చారు. జాతరకు వచ్చే భక్తులకు ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశారు. రోడ్డు మార్గాన కాలినడకన భక్తులు జాతరకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**జాతరలో డాగ్స్ కార్డు తనిఖీలు**
వికారాబాద్ జిల్లా కోటిరెడ్డి ఆదేశాలతో ధారూర్ మెథడిస్ట్ జాతరలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా డాగ స్వాడ్ బాంబ్ డిస్పోజల్ టీం అధికారులు తనిఖీలు నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

**కొడంగల్, డిసెంబర్ 11ప్రభాతవార్త**
కార్తీక మాసంతో పాటు మాసశివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీమహదేవుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆలయ భజన మండలి అద్వర్యంలో లింగాష్టక పారాయణం, అనంతరం శివలింగానికి పంచామృతాభిషేకం, శివ అష్టోత్తర శతనామావళి, దూప దీపనైవేద్యాలను సమర్పిస్తు మంగళహరతులు అందించారు. ఆలయ అవరణలో ఉసిర, వేప, ర్యాల, మారేడు బిల్ల వృక్షాలకు దీపాలు వెలిగించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్తీకమాసం, సోమవారం, మాస శివరాత్రి సందర్బంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారిని దర్శించు కుంటున్న భక్తులు

## పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్దులకు బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

**కొడంగల్, డిసెంబర్ 11ప్రభాతవార్త**
విద్యార్దులే ఉపాద్యాయులుగా మారి తోటి విద్యార్దులకు చక్కటి బోధనతో అలరిస్తు స్వయం పరిపాలన దినోత్సవాన్ని మండల పరిధిలోని పాతకొడంగల్ ప్రాధమిక పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. స్వయం పరిపాలన దినోత్సవంలో భాగంగా కలెక్టర్‌గా గొల్ల రాఘవేందర్, డీఈఓగా పిట్ట శేఖర్, ఎంఈఓగా మామిల్ల శేఖర్, సీఆర్పీగా నిరంజన్, హెచ్ఎంగా అభిలాష్, పీఈటీగా సాయి వరుణ్, అటెండర్‌గా అరవింద్‌లతో పాటు ఉపాద్యాయులుగా శ్రీహరి, పురుషోత్తం, అదిత్య, ప్రసాద్, శ్రీనిధి, అనూష, సంతోషి, జగదీష్, శ్రవణ్ తదితరులు చక్కటి బోధనతో అలరించారు. బోధనలో అలరించిన విద్యార్దులకు పాఠశాల ప్రధానోపాద్యాయులు క్రాంతికుమార్ బహుమతులు అందించారు.

## రామలింగేశ్వరస్వామికి భక్తితో అభిషేకం



ఎదులాబాద్‌లో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామికి ఘనంగా అభిషేకం నిర్వహించారు. వంజరివాడలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్బంగా కుమారస్వామి ఆధ్వర్యంలో భక్తులు స్వామికి భక్తి, శ్రద్దలతో అభిషేకం చేశారు. పాలు, తెనే, నెయ్యి, పెరుగు, విభూతితో లింగానికి అభిషేకం చేసి నైవేద్యం సమర్పించారు. కార్తీకమాసంలో ఇక్కడ నిత్యం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో మహిళలు విచ్చేసి కార్తీకదీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో వార్డుసభ్యురాలు సామల భవాని అమర్, నాయకులు పొత్నక్ మల్లికార్జున్‌రాజు, సామల వెంకటేశ్, నవీన్, అభిషేక్, నితిన్, చరణ్, బానుక రాజు, తుదిగని నర్సింహ్మా, శ్రీను, పోత్నక్ గిరిజ, సంతోష్, శ్వేత, సామల సరిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

## తాటిగడ్డ తండాలో గేదె దూడలపై హైనా పంజా

### -సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు

### -హైనా పనే అయి ఉంటుందని తెలిచి చెప్పిన వైనం

**నందిగామ డిసెంబరు12, ప్రభాతవార్త :** మొన్న కొత్తూరు, నిన్న నందిగామ మండలంలో హైనా అనే క్రూర జంతువు సంచరించడంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నందిగామ మండలం తాటిగడ్డ తండాలో ఆదివారం రాత్రి తండా రెండవ వార్డు సభ్యుడు జెటావత్ గణేష్ నాయక్ వ్యవసాయ పొలంలో పశువుల కోటంలో కట్టేసి ఉంచిన రెండు గేదె దూడలపై పంజా విసరడంతో ఒకటి మృతి చెందగా మరొకటి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. ఈ సంఘటనతో చుట్టపక్కల గ్రామాల రైతులు గిరిజనులు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. సంఘటన సమాచారం తెలిసిన షాద్‌నగర్ డివిజన ఎఫ్ఎస్ఓ రవీందర్ గౌడ్, ఆమనగల్ రేంజ్ షాద్‌నగర్ డివిజన్ బిటీ అధికారి ఎంఎ అజిజ్, నందిగామ ఎస్ఐ కొండలరావులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. నక్కలా పులి చేరాలు కలిగి ఉండే హైనా పనే అయి ఉంటుందని అధికారులు తేల్చి చెప్పారు. ఏది ఏమైనా చనిపోయిన గేదె దూడను పోస్టుమర్టం నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



హైనా దాడిలో మృతి చెందిన గేదె దూడను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు, నందిగామ ఎస్ఐ కొండల్ రావు, తదితరులు